క్లుప్తంగా

చలివేంద్రాల ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. చలివేంద్రాల ద్వారా ప్రజా సేవలో మమేకమవుతున్న పార్టీ శ్రేణులను అభినందించారు. గోకవరం బస్టాండ్, లలితా జ్యూయలరీ సెంటర్, మార్కెట్ యార్డు, మెయిన్ రోడ్డు వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ, బర్రే కొండబాబు, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: ఇన్‌చార్జి ఎంపీడీవోగా డి.శ్రీనివాసరావు గురువారం హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంబాజీపేట ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఇప్పటివరకు కడియం ఎంపీడీవో కె.రత్నకుమారి రూరల్ ఇన్‌చార్జిగా పనిచేశారు. కాగా.. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడంతో పాటు, ప్రజాప్రతినిధుల సూచనలతో మండలాన్ని అభివృద్ధిపథంలో తీసుకువెళతానన్నారు. ముందుగా వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

టీడీపీ సమావేశం


కడియం: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ రైతు నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌పై రైతులకు సలహాలు అందించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మణిదీప్

పెదపూడి: ఖరీఫ్ పనులపై రైతులు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఏఓ టీవీఆర్ మణిదీప్ గ్రామ వ్యవసాయ సహాయకులు సూచించారు. జి.మామిడాడ గ్రామంలోని స్థానిక రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. మణిదీప్ మాట్లాడుతూ మొదటిగా మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కల్పించారు. మండలంలో 570 మట్టి నమూనా పరీక్షలు చేశారన్నారు. మట్టి నమూనా పరీక్షలు ఏ విధంగా సేకరించాలి, సేకరించిన తర్వాత దాని వివరాలు మొబైల్ యాప్‌లో ఏలా అప్‌లోడు చేయాలి, క్షేత్రస్థాయిలో ఏమి చేయాలో అవగాహన కల్పించారు. ప్రస్తుత తొలకరి పంట నారు మడులు త్వరితగతిన చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తూ నారు మడి వేసే ముందు విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలని అవగాహన కల్పించాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో కేంద్రం ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి సహాయం సంవత్సరానికి రూ.6వేల రావడానికి తప్పని సరిగా రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. ఈ విషయం గ్రామ స్థాయిలో రైతులకు తెలియజేయాలన్నారు. కౌలు రైతులకు కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	ఆదిపురుష్
సూర్యమినీ	దిఫ్లాష్
సూర్యప్యాలెస్	ఆదిపురుష్
స్వామి	బిచ్చగాడు-2
శివజ్యోతి	ఆదిపురుష్
అనుశ్రీ	ఆదిపురుష్
రాజా	ఆదిపురుష్
అశోక	ఆదిపురుష్
ఊర్వశి	ఆదిపురుష్
రంభ	ఆదిపురుష్
మేనక	టక్కర్
అప్సర	దిఫ్లాష్
నామవరం	
వీఎస్ మహల్	ఆదిపురుష్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	ఆదిపురుష్
కడియం	
వెంకటసూర్య	ఆదిపురుష్

విద్యకు అధిక ప్రాధాన్యం

- విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఆణిముత్యాలు
- ఎంపీ భరత్‌రామ్


విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో గురువారం విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరిట పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం రూపొందించారన్నారు. చదువులో ప్రతిభ చూపిన వారిని మరింత ప్రోత్సహించాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అప్‌డేట్ అవుతూ ఉండాలన్నారు. రానున్న రోజుల్లో రాజమహేంద్రవరం నుంచి మరెందరో విద్యార్థులు ఆణిముత్యాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

చదువుకు భరోసా

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి విద్యార్థులందరికీ మేనమామగా ఉంటూ వారి చదువుకు భరోసా ఇస్తున్నారన్నారు. చదువును ప్రోత్సహించేందుకు ఆణిముత్యాలు కార్యక్రమాన్ని రూపొందించారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు పోటీపడే స్థాయికి విద్యావ్యవస్థను అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తమన్నారు. అనంతరం నగరంలో పదోతరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. ఇంటర్ విద్యార్థులకు నాలుగు గ్రూపుల నుంచి ఒకొక్కరికి రూ.15 వేలు చొప్పున అందించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయురాలు జీవీవీ రమాదేవి వ్యవహరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, పీతా రామకృష్ణ, నక్కా శ్రీనగేష్, బర్రే కొండబాబు పాల్గొన్నారు.

ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు


వలంటీర్లను సత్కరిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- నూతన భవనాల ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లకు నూతన భవనాల ఏర్పాటు ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పౌరసేవలు, వైద్యసేవలు అందుతాయని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరులో సచివాలయం-1 పరిధిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-5 నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలన్న ఏకైక లక్ష్యంతో గ్రామాల్లో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేశారని, కాతేరులో పీహెచ్‌సీతో పాటు, ఐదు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. దీంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందజేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు గ్రామ సచివాలయం -5 పరిధిలో వలంటీర్లను పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, సచివాలయ సెక్రటరీ వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు యెజ్జు వాసు ఆధ్వర్యంలో చందన చేతుల మీదుగా సత్కరించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమాల్లో కాతేరు వైద్యురాలు ఈ.నాగదేవి, పంచాయతీరాజ్ ఏఈ సంపత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, హెల్త్ సూపర్ వైజర్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆచంట కల్యాణ్, కొత్తపల్లి నాగేశ్వరరావు, మద్దా దుర్గారావు, దార్ల రాము పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం

రాజానగరం: అభం శుభం తెలియని ఆరేళ్ల బాలికపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆ బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్థానిక జంగాలకాలనీలో గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. ద్వారపూడికి చెందిన షేక్ మీరావలీ (38) పైకాలనీలోని అత్తారింటికి వచ్చి నివాసం ఉంటున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో తాళాలు బాగుచేస్తూ జీవనం గడుపుతున్న అతడి దృష్టి పక్కింటిలోనే నివాసం ఉంటున్న ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులపై పడింది. తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లడంతో ఆరుబయట ఆడుకుంటున్న 8, 6 సంవత్సరాల వయసున్న అక్కాచెల్లెళ్లకు అన్నం పెడతానని ఆశ పెట్టి తన ఇంటిలోకి తీసుకువెళ్లాడు. అక్కపై అత్యాచారానికి ప్రయత్నించడంతో ఆ బాలిక భయపడి బయటకు పారిపోయింది. ఆరేళ్ల బాలికను పారిపోకుండా పట్టుకుని, బలవంతంగా తన కామవాంఛను తీర్చుకున్నాడు. దీనితో ఆ చిన్నారి తీవ్ర రక్తస్రావంతో బిగ్గరగా ఏడుస్తుండటంతో ఇరుగు పొరుగు వెళ్లి చూస్తే జరిగిన దారుణం బయటపడింది. వెంటనే ఆ చిన్నారిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్‌ను ప్రశ్నించగా జరిగిన సంఘటన వాస్తవమేనని, అయితే బాలిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నందున పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు.

కార్మికుల సంక్షేమానికి అన్నివిధాలా కృషి

- ఎంపీ భరత్ రామ్
- పేపర్ మిల్లు కార్మికులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఏపీ పేపర్‌మిల్లు మెయిన్ గేటు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణసాయి కల్యాణ మండపంలో గురువారం ఏపీ కార్మిక సంఘం జనరల్ కార్యదర్శి చిట్టూరి ప్రవీణ్ చౌదరి ఆధ్వర్యంలో పేపర్ మిల్లు కార్మికుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ భరత్ రామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కట్ చేసిన అలవెన్సులు ఇప్పించాలని, పెంచిన క్యాంటీన్ ధరలు తగ్గించాలని, కాంట్రాక్టు కార్మికులకు మరో ఆరు నెలల సమయం ఉందని ఈలోపు రెన్యువల్ జరిగేలా మేనేజ్‌మెంట్‌తో చర్చించాలని, జీవిత బీమా కేవలం ఒక్క కార్మికుడికే కాకుండా కుటుంబ సభ్యులందరికీ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యలను విన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అయితే కార్మికులు గ్రూపులుగా విడిపోకుండా అందరూ ఏకాభిప్రాయంతో ఒకే గొడుగు కిందకు వస్తే లాభం ఉంటుందన్నారు. సంఘాలతో తనకు పనిలేదని ఏ సంఘం కార్మికుడు వచ్చినా వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాకపోతే కార్మికుల ఐక్యత ముందు ఎవరైనా తలవంచాల్సిందేనని, సంఘటిత శక్తితో హక్కులు, డిమాండ్లు, సమస్యలు పరిష్కరించుకోవడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీ సమైక్య కార్మిక సంఘం అధ్యక్షుడు బుద్దాల మురళి, జనరల్ సెక్రటరీ ఎస్.ప్రకాష్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

బాధితులకు ఎస్సీ కమిషన్ చైర్మన్ పరామర్శ


బాధితురాలిని పరామర్శిస్తున్న విక్టర్ ప్రసాద్

సీటీఆర్ఐ: గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో జరిగిన దాడి ఘటనలో గాయాలపాలై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత బాధితులను ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ గురువారం పరామర్శించారు. కాళ్లు విరిగిపోయి చికిత్స పొందుతున్న బాధితురాలను సంఘటనకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా తాము పెట్టిన విగ్రహాన్ని తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని గ్రామంలోని ఎస్సీలందరూ అడ్డుకున్నామని, ఈ తరుణంలోనే అర్ధరాత్రి సమయంలో విద్యుత్తు సరఫరాను నిలిపివేసి పోలీసులు, పెత్తందారులు కలిసి దాడి చేశారని ఆమె తెలిపారు. అనంతరం విక్టర్ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ తిరుమలాయపాలెం ఎస్సీపేటపై పోలీసులే దాడులకు పాల్పడే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు.

మోదీ పాలనకు అందరి మద్దతు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ అన్నారు. నగరంలో గురువారం గృహ సంపర్క అభియాన్ నిర్వహించి పలువురు ప్రముఖులను కలిశారు. ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ చల్లా శంకరరావు, ప్రముఖ డయాబెటిస్ వైద్యనిపుణులు వివేక్, ప్రముఖ కాంట్రాక్టర్, ఆధ్యాత్మికవేత్త తోట సుబ్బారావు, కాళ్లకూరి కుమార్, యశ్వంత్ నివాసాలకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి, వారి సూచనలు, సలహాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగారావు పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్


తొర్రేడులో మాట్లాడుతున్న మహ్మద్ ఆరీఫ్

రాజమహేంద్రవరం రూరల్: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లింలు రుణపడి ఉంటారని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్ఆర్ – హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా ఆదేశాల మేరకు గురువారం ఆయన నేతృత్వంలో తొర్రేడు, వెంకటనగరం, కొంతమూరు, మల్లయ్యపేట శాంతినగర్ మసీదులను సందర్శించారు. మస్జిద్ కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరీఫ్ మాట్లాడుతూ ఉర్దూకు రెండో అధికార భాష హోదా కల్పించడంతో పాటు, గతంలో రూ.ఎనిమిది వేలు ఉన్న మసీదు ఇమాం, మౌజన్‌ల జీతాలను రూ.15 వేలకు పెంచి పెద్ద మనసును చాటుకున్నారన్నారు. వక్ఫ్ భూములను సంరక్షించడంతో పాటు కర్నూల్‌లో వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి వక్ఫ్‌ఆస్తుల రక్షణకు చేసిన ముందస్తు చర్యలను ముస్లిం మైనారిటీలు హర్షిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక మసీదుల వద్ద నెలకొన్న సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు షబ్బర్ బాషా, మహ్మద్ జఫ్రూలా ఖాన్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు


ఆర్చరీ పోటీల విజేతలతో నిర్వాహకులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని దిఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రీజినల్ క్రీడా పోటీల్లో భాగంగా గురువారం ఆర్చరీ విభాగంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17, 19 బాలు, బాలికల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శేషగిరిధర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మనోవికాసానికి దోహదం చేస్తాయని, ఏకాగ్రత వృద్ధి చెందుతుందన్నారు. తమ ఫ్యూచర్‌కిడ్స్ స్కూలు ఈ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు తొలిసారిగా ఆతిథ్యమిస్తోందన్నారు. ఆర్చరీ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్.ప్రభాకర్, బి.వెంకటరమణ ముఖ్యఅతిథులుగా హాజరుకాగా, చంద్రమౌళి పరిశీలకులుగా వ్యవహరించారు. పాఠశాల డైరెక్టర్ వై.రవిబాబు, చైర్‌పర్సన్ విజయకుమారి, పాఠశాల సీఈవో మహస్వి, డీన్ హర్షిణి, వైస్ ప్రిన్సిపాల్ సైదాబాను, శ్రీవల్లి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కడియం: సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తున్నాడని మందలించినందుకు తన కుమారుడు ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకూ తిరిగిరాలేదని వేమగిరి గ్రామానికి చెందిన సూరంపూడి నాగలక్ష్మి గురువారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాగలక్ష్మి రెండో కుమారుడు 19 ఏళ్ల వెంకటనారాయణ ఇంటిలో సెల్‌ఫోన్‌తోనే ఉంటున్నాడు. ఇది చూసిన తల్లి నాగలక్ష్మి అతడిని మందలించింది. దీంతో వెంకటనారాయణ ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ కానుకలు


రంగంపేట హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

రంగంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు ఓ వరం లాంటివని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం వి.పార్థసారథి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రభుత్వం ప్రకటించిన ప్రతి పాఠశాల నుంచి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ. 2 వేలు, తృతీయ స్థానం సాధించి విద్యార్థులకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ తిరుపతి శ్రీనివాస్, ఎంపీటీసీ సూర్యకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

27న నన్నయలో వర్క్‌షాప్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఏపీ ఉన్నత విద్యా ప్రణాళికా బోర్డు, ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ రీజినల్ క్లస్టర్ ఆఫ్ గోదావరి డిస్ట్రిక్ట్స్ సహకారంతో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈనెల 27న డేటా ఎనలిటిక్స్‌పై వర్క్‌షాప్ జరగనుంది. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను గురువారం వీసీ ఆచార్య కె.పద్మరాజు విడుదల చేశారు. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఆచార్య పి.సురేష్ వర్మ, డాక్టర్ బి.కెజియారాణి, ఆచార్య కేఎస్ రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయనిర్మల పాల్గొన్నారు.

మొక్కల కవర్ల చోరీ

కడియం: తన నర్సరీ పాయింట్ వద్ద ఉంచిన రూ.50 వేల విలువైన మొక్కల కవర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారని దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుందేటి వెంకన్నబాబు గురువారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. వెంకన్నబాబు బుధవారం రూ.50 వేల విలువైన మొక్కల కవర్లను కొనుగోలు చేసి మాధవరాయుడుపాలెంలోని నర్సరీ వద్ద పెట్టాడు. గురువారం ఉదయం నర్సరీ వద్దకు వెళ్లేసరికి అవి మాయమయ్యాయి. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు సమస్యకు మోక్షం

- రూ.49 లక్షలతో జల్లకాలువ మరమ్మతులు
- శ్రీకారం చుట్టిన కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్


కాతేరులో గోదావరి గట్టు వద్ద జల్లకాలువ


పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో గోదావరి గట్టు వద్ద జల్లకాలువ గేటు మరమ్మత్తులు, క్రాస్‌బండ్ పనులు చేపట్టడం ద్వారా వరి పొలాలకు ముంపు సమస్య తగ్గనుంది. గోదావరికి వరదలు వచ్చే సమయంలో నీరు వెనక్కి తన్నడం ద్వారా ఆరు గ్రామాల్లో పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్‌అండ్‌బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ రూ.49 లక్షలను మరమ్మత్తులకు మంజూరు చేయించారు. గురువారం రైతులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.

వివరాలు ఇవీ..

కాతేరులో గోదావరి గట్టు వద్ద వందేళ్ల నాటి జల్ల కాలువ గేటు ఉంది. దీనిద్వారా కాతేరు, వెంకటనగరం, తొర్రేడు, కొంతమూరు, కోలమూరు, గాడాల, మధురపూడి గ్రామాల్లో పొలాలకు నీరు సరఫరా జరిగేది. ఈ పరిధిలో సుమారు 2,700 ఎకరాల వరి పొలాలు ఉన్నాయి. వరదల సమయంలో జల్లకాలువ గేటు వద్ద నీరు వెనక్కి తన్నడంతో పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. ఈ సమస్యను తొర్రేడు, కాతేరు, వెంకటనగరం రైతులు వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఈ విషయాన్ని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులకు తెలియజేసి, జల్లకాలువ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని, రూ.49 లక్షలతో ప్రతిపాదనలు చేసి పంపించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని చందన నాగేశ్వర్ రూ.70 లక్షలతో జల్లకాలువ గేట్లును పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు సైతం పంపించారు.

లిఫ్ట్‌స్కీమ్ ఏర్పాటుకు చర్యలు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని స్వయంగా రైతులతో కలిసి కాతేరు జల్లకాలువ వద్ద లిఫ్ట్‌స్కీమ్ ఆవశ్యకతను తెలియజేసి, దానిని మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ హెడ్ వర్క్స్ డీఈ ఆనందబాబు, ఏఈ శివప్రసాద్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీమన్నారాయణ, తొర్రేడు, కాతేరు సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకటరావు, ఆచంట కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.